

## రామచిలుకకు అవార్డ్

సాహసాలు చేయడం, ప్రాణాలు కాపాడడం మనుషులే కాదు...నోరు లేని జీవాలు కూడా చేయగలవు అని నిరూపించింది ఓ రామచిలుక. పసిబిడ్డ ప్రాణం కాపాడి తన యజమాని రుణం తీర్చుకుంది. మాటలు రాకపోయినా, రామచిలుక కేవలం అరుపులు, కేకలు ద్వారా ఓ పసిబిడ్డ ప్రాణం కాపాడిన సంఘటన వివరాలు....

మెగాన్ హువార్ట్ అనే ఇల్లాలు 'విల్లీ' అనే రామచిలుకను పెంచుకుంటోంది. ఓ రోజు మెగాన్ పనిమీద బయటకు వెళుతూ, రామచిలకతో పాటు తన బిడ్డను కూడా ఇంట్లోనే వదిలి వెళ్లింది. వెళుతు వెళుతూ పసిబిడ్డ తినడానికి బిస్కట్లు, ఆడుకోవడానికి కొన్ని బొమ్మలు బిడ్డ ముందు ఏర్పాటు చేసి వెళ్లింది. ఆమె వెళ్లిన కొద్దిసేపటికి ఆ బిడ్డ బొమ్మలతో ఆడుకుంటూ తన రెండు చేతులతో గొంతు నొక్కుకుంది. వాటిని తిరిగి వెనక్కి తీసుకోవడం రాక, ఊపిరి ఆడక ఆ బిడ్డ ఉక్కిరిబిక్కిరి అవసాగింది. బిడ్డ అవస్థ చూసిన రామచిలుకకు ఏం చేయాలో పాలుపోలేదు. ఎవరినైనా పిలుద్దామా అంటే మాట్లాడడం రాదు. రెక్కలు టపటపా కొట్టి శబ్దం చేస్తూ, పెద్దగా అరవడం ప్రారంభించింది. ఆ అరుపులు అప్పుడే వస్తున్న మెగాన్ వింది. గబగబా లోపలకి వచ్చి బిడ్డ చేతులను గొంతు మీంచి తీసేసింది.

ఈ సందర్భంగా మెగాన్ మాట్లాడుతూ, 'విల్లీ' లేకపోతే నా బిడ్డ ప్రాణం పోయి ఉండేది. అప్పటికే బిడ్డ శరీరం నీలం రంగుకి మారడం మొదలుపెట్టింది. బిడ్డ ప్రాణం కాపాడి నిజంగా హీరో అనిపించుకుంది' అంటూ వివరించింది. తన అరుపులు, కేకలతో ఓ బిడ్డ ప్రాణం కాపాడిన 'విల్లీ'కి స్థానిక రెడ్ క్రాస్ సంస్థ వారు 'చాపర్ట్ యానిమల్ లైఫ్ సేవర్ అవార్డ్'ను ప్రకటించారు. యజమానికి సేవ చేయడంలో కుక్కకు ఉన్నంత విశ్వాసాన్ని చూపించిన 'విల్లీ'ని పలువురు అభినందించారు.

*

## 'సరసి' కత

వైశంపాయనుడు తిరుపతి నుంచి ఆ రోజే దిగేడు.

"కొంపంతా అగ్ని గుండంలా వుందీ ఎండలకి. చల్లగా వుండటానికి డాబా మీద తెల్లగా సున్నం లాంటిదేదో వేస్తారటగా, టీవీలో చూపిస్తున్నారు, అది వేయించండీ" అంది భార్య సుబ్బాయమ్మ గారు.

ఆ సాయంత్రమే ఆ సున్నం పేకట్టు కొన్నాడు వైశంపాయనుడు. మర్నాడు చీకటితోనే లేచి, భార్యభర్త లిద్దరూ డాబా అంతా చీపురుతో శుభ్రం చేసి, కాసిని నీళ్లు జల్లేరు. తర్వాత ఆ ప్యాకెట్టులో పొడర్ని రెండు బకెట్లలో కలిపి ఇద్దరూ చెరో బ్రష్షూ పట్టుకుని పామడం ప్రాంభించారు. తొమ్మిది గంటలకి ఎండ ఎక్కువయ్యే టైముకి మొత్తం డాబా అంతా పులమడం పూర్తయ్యింది.

### కూల్ కూల్




"ఇంక కొంప చల్లగా వుంటుంది లెండి ఫరవాలేదు. అన్నట్టు కాస్త సున్నం మిగిలింది. పక్క వాళ్లకిద్దామా?" అంది సుబ్బాయమ్మగారు బకెట్లోకి తొంగి చూస్తూ.

"చాల్లే. బోలెడు డబ్బు పెట్టి కొన్నాం. అక్కడ పెట్టి వెళ్లు" అన్నాడు వైశంపాయనుడు వొంటికి పట్టిన చెమటల్ని తుడుచుకుంటూ. ఆమె వెళ్లిన కొద్ది సేపటికి అత గాడు కూడా దిగేడు. సుబ్బాయమ్మ గారు భర్త వంక చూస్తూనే కెవ్వుమని కేక పెట్టింది.

గుండు నిండా చిక్కగా సున్నం పులుముకుని దర్శనం ఇచ్చాడతడు. "పై బుర్ర చల్లగా వుంటే కింద వొళ్లంతా చల్లగా వుంటుంది" అన్నాడు వైశంపాయనుడు.

*